క్లుప్తంగా

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న రమేష్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నవ యువ యూత్‌ క్లబ్‌ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చిన్నారులకు సంప్రదాయ పద్ధతిలో అక్షరాభ్యాసం చేయించడం ఆనందంగా ఉందన్నారు. విద్యాభివృద్ధికి, విద్యాలయాల్లో వసతుల కల్పనకు క్లబ్‌ తరఫున అండగా నిలుస్తున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్‌ అనిత, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేసిన కాంగ్రెస్‌ నేతలు

మణికొండ: కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేత, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌ గాంధీ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ మణికొండ మున్సిపల్‌ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు ఎం.జితేందర్‌, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్‌.కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కిస్మత్‌పూర్‌లోని ఆరాధన అనాథాశ్రయంలో పిల్లలతో కేక్‌ కట్‌ చేయించి ఉత్సవాలు జరుపుకొన్నారు. అనంతరం అనాథ విద్యార్థులకు నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. మాజీ కౌన్సిలర్‌లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కస్తూరి సతీష్‌, కార్యదర్శి అఖిల్‌, నాయకులు శ్రావణ్‌, గణేష్‌, ఆకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల కూల్చివేత



అక్రమణలను కూల్చివేస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: కొందరు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి షెడ్లు వేయడంతో పాటు గుడిసెలు వేసుకుంటున్నారని వాటిని ఎంతమాత్రం సహించబోమని రాజేంద్రనగర్‌ టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ శ్రీధర్‌ అన్నారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ కాటేదాన్‌, ఓల్డ్‌ కర్నూల్‌ రోడ్డుపై ఇరువైపులా ఆక్రమించి వేసిన షెడ్లను కూల్చివేశారు. భారీ పోలీసుల బందోబస్తు నడుమ జేసీబీలతో వీటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ప్రజలు స్థిర గుడిసెలు వేసుకోవడంతో పాటు అక్రమంగా ఫుట్‌పాతలను ఆక్రమించి షెడ్లు వేసుకుంటున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన ఫుట్‌పాత్‌లు పూర్తిగా కనుమరుగు అవుతున్నాయన్నారు. వీటిని గుర్తించి నేలమట్టం చేస్తున్నామన్నారు. మరోసారి నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కూల్చివేతలు దారుణం

మైలార్‌దేవ్‌పల్లి: కూలీనాలీ చేసుకొని జీవనం సాగిస్తున్న నిరుపేదలపై జీహెచ్‌ఎంసీ అధికారులు వ్యవహరించిన తీరు అమానుషం అని బీఆర్‌ఎస్‌ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ అధ్యక్షుడు ఎస్‌.వెంకటేష్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం డివిజన్‌ పరిధిలోని కాటేదాన్‌ ఓల్డ్‌ కర్నూల్‌ రోడ్డుపై ఫుట్‌పాత్‌ల అక్రమణలు అంటూ ఆగమేఘాల మీద వచ్చి నిరుపేదలకు చేసుకుంటున్న వ్యాపార సాముదాయాన్ని కూల్చివేయడం సరైంది కాదని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ యూత్‌ అధ్యక్షుడు అక్కెం రఘువేందర్‌యాదవ్‌, నాయకులు మైసిరెడ్డి, లక్ష్మీరాజ్‌, రాజు, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ మోర్చా విజయ్‌ సంకల్ప్‌ సభ

రాజేంద్రనగర్‌: బీజేపీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గం ఎస్సీ మోర్చా విజయ్‌ సంకల్ప్‌ సభ–2025ను శుక్రవారం నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్‌, ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి కుమార్‌, భోగి గణేష్‌ కుమార్‌ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రాజేంద్రనగర్‌ మాణిక్యమ్మ కాలనీలో నిర్వహిస్తామన్నారు. సభకు నియోజకవర్గ సీనియర్‌ నాయకులు, బూత్‌ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోడ్ల విస్తరణకు సర్వం సిద్ధం

రూ. 9 కోట్లతో మర్రిచెట్టు రోడ్డు

- రూ. 15 కోట్లతో పైప్‌లైన్‌ రోడ్డు
- 21న టెండర్‌ల ఓపెన్‌
- వచ్చే నెలలో పనులు ప్రారంభం
- 4 లైన్‌ రోడ్డుగా మర్రిచెట్టు రోడ్డు
- మర్రిచెట్టు కూడలిలో తొలగనున్న ఆక్రమణలు



ఇరుకుగా ఉన్న పైప్‌లైన్‌ రోడ్డు

మణికొండ: హైదరాబాద్‌ మహా నగరానికి మణిదీపంలా మణికొండ మున్సిపాలిటీ విరాజిల్లుతోంది. అయితే ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించనుందున స్థానికంగా పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా వాహనాల రాకపోకలకు కష్టతరమై తరచూ ట్రాఫిక్‌ సమస్యలు నెలకొంటున్నాయి.

- మున్సిపాలిటీకి వచ్చే ప్రధాన రోడ్ల పక్కన ఆక్రమణలు, గుడిసెలు, ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఇదేమి మణికొండ మున్సిపాలిటీ అంటూ నిట్టూర్చటం పరిపాటిగా మారింది.
- హెచ్‌ఎండీఏ మాస్టర్‌ ప్లాన్‌లలో మాత్రం అన్ని ప్రధాన రోడ్లు వంద అడుగులుగా, అనేక లింక్‌ రోడ్లతో అబ్బో అనిపిస్తుంది. ఆచరణలోకి వచ్చేసరికి పేరు గొప్ప.. ఊరు దిబ్బ అనే చందాన తయారైంది.
- అలాంటి రోడ్ల రూపురేఖలను మార్చాలని షేక్‌పేట నుంచి మణికొండ మీదుగా ఔటర్‌రింగ్‌ రోడ్డుకు కనెక్టివిటీగా వంద అడుగుల రేడియల్‌ రోడ్డు–5ను చేపట్టారు. అది కాస్తా ఒకవైపు గండిపేట క్యాండూట్‌ ఉండటంతో వంద అడుగులకు సాధ్యం కాక కేవలం 40 అడుగులకే పరిమితమైంది.
- ఇదే తరహాలో మణికొండ మర్రిచెట్టు నుంచి రాయదర్గం రోడ్డులో భాగ్యలక్ష్మి కాలనీ వరకు 80 అడుగుల విస్తీర్ణంతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలను సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ రోడ్డు డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (హెచ్‌ఆర్‌డీసీఎల్‌) నుంచి రూ. 60 కోట్లు నిధులు ఇస్తామని హామీ ఇవ్వటంతో డీపీఆర్‌లను సైతం సిద్ధం చేసి పంపారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావటం, ప్రభుత్వం మారటంతో అవి అటకెక్కాయి. ఈ రెండు రోడ్లతో పాటు మణికొండ మున్సిపాలిటీకి వచ్చే మరో ప్రధాన రోడ్డు అయిన అలిజాపూర్‌ నుంచి అలకాపూర్‌ చౌరస్తా వరకు ఉన్న రోడ్డును అదే హెచ్‌ఆర్‌డీసీఎల్‌ వారు భూ సేకరణ చేపట్టి 4 లైన్‌ రోడ్డుగా అభివృద్ధి చేశారు. మిగిలి ఉన్న సెంట్రల్‌ డివైడర్‌ పనులు కొనసాగుతున్నాయి. వెంకటేశ్వర కాలనీ వద్ద ఇరుకుగా ఉన్న కల్వర్టును వెడల్పు చేసేందుకు పందెన్‌వాగు అభివృద్ధి ప్రాజెక్టులో చేర్చారు. దాంతో అది సంపూర్ణంగా 4 లైన్‌ రోడ్డుగా త్వరలోనే మారనుంది.

అవాంతరాలను దాటి...

గతంలో హెచ్‌ఆర్‌డీసీఎల్‌ ఇస్తామన్న నిధులను ఇవ్వకపోవటంతో ఫ్రెండ్స్‌ కాలనీ నుంచి బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్‌ వరకు, మర్రిచెట్టు నుంచి భాగ్యలక్ష్మి కాలనీ వరకు రోడ్ల అభివృద్ధి మధ్యలోనే ఆగిపోయింది. మున్సిపాలిటీలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ట్రాఫిక్‌, రోడ్ల ఆక్రమణలు, రోడ్ల వెడల్పు ఆవశ్యకతను గమనించిన మున్సిపాలిటీ ఇంజనీరింగ్‌ అధికారులు తమ నిధులతోనే వాటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దాంతో మర్రిచెట్టు నుంచి భాగ్యలక్ష్మి కాలనీ వరకు 80 అడుగుల వెడల్పు, మధ్యలో డివైడర్‌, సెంట్రల్‌ లైటింగ్‌తో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ. 9 కోట్లతో పనులను చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

- ఇదే తరహాలో మణికొండ మున్సిపాలిటీ ప్రవేశం ఫ్రెండ్స్‌ కాలనీ నుంచి నార్సింగి మున్సిపాలిటీ సరిహద్దు వరకు ఉన్న రోడ్డును 60 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ. 15 కోట్ల వ్యయంతో టెండర్‌లు పిలిచారు. ఈ నెల 21వ తేదీన టెండర్‌లు తెరిచి కాంట్రాక్టర్‌లకు పనులు అప్పగించేందుకు సిద్ధం అవుతున్నామని మున్సిపల్‌ ఇంజనీరింగ్‌ అధికారులు వెల్లడించారు.
- రెండు రోడ్ల పనులను పూర్తయితే రాబోయే రోజుల్లో మణికొండ మున్సిపాలిటీ కేంద్రానికి రాకపోకలు సాగించే ప్రజలకు ట్రాఫిక్‌ చిక్కులు తీరే అవకాశం ఉంటుందని వారు వివరించారు.



ఫోర్‌లైన్‌ రోడ్డుగా అభివృద్ధి చెందనున్న మర్రిచెట్టు రోడ్డు



తుది మెరుగులు దిద్దుకుంటున్న అలిజాపూర్‌ రోడ్డు

ఆక్రమణలను తొలగిస్తాం



మణికొండ మున్సిపల్‌ కేంద్రానికి వచ్చే రెండు ప్రధాన రోడ్లను సాధ్యమైనంతమే విస్తరించేందుకు రూ. 24 కోట్ల వ్యయంతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లను పిలిచాము. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల నుంచి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో నిలిచిపోయిన స్థానిక సంస్థల పన్ను డబ్బును విడుదల చేసింది. ఆ నిధులతో మున్సిపాలిటీ ప్రజలకు ఉపశమనం కలిగించే పందెన్‌వాగు అభివృద్ధి, రోడ్ల వెడల్పు పనులను చేపట్టాం. ఈ రెండు పనులు పూర్తయితే మున్సిపాలిటీ ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుంది. వచ్చే నెలలో రెండు పనులను ప్రారంభించే అవకాశం ఉంది.

డి.ప్రదీప్‌కుమార్‌, కమిషనర్‌, మణికొండ

నేడు డయల్‌ యువర్‌ ఆర్టీసీ డీఎం

రాజేంద్రనగర్‌: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా రాజేంద్రనగర్‌ ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీజీఎస్‌ ఆర్టీసీ రాజేంద్రనగర్‌ డిపో మేనేజర్‌ బి.కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్‌ పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని ఆర్టీసీ బస్సు సమస్యలు, విలువైన సూచనలు, నూతన రూట్‌లో బస్సులు తదితర వాటిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రయాణికులు తమ ఫిర్యాదులు, సలహాలను ఫోన్‌: 99592 26135లో నమోదు చేయాలని డీఎం సూచించారు.

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్‌ నేతలు

శంషాబాద్‌: కాంగ్రెస్‌ అగ్రనేత, ఎంపీ రాహుల్‌ గాంధీ జన్మదిన వేడుకలను శంషాబాద్‌ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్‌ ఆధ్వర్యంలో అంబేద్కర్‌ విగ్రహం వద్ద కేక్‌కట్‌ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ ఎస్సీసెల్‌ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్‌, జిల్లా అధికార ప్రతినిధి మైలారం సులోచన, నాగేందర్‌రెడ్డి, లింగంయాదవ్‌, నజీరుద్దీన్‌, అశోక్‌, పరమేష్‌, శ్రీకాంత్‌యాదవ్‌, శేఖర్‌, గుంటి ప్రవీణ్‌, లింగంగౌడ్‌, ఉమామహేష్‌, పాల్సన్‌, ఇమ్రాన్‌, మనోహర్‌ తతదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

మణికొండ: పాఠశాలల్లో విద్యతో పాటు క్రీడలను విద్యార్థులు దినందిన జీవన విధానంలో భాగం చేసే దిశగా చర్యలు తీసుకుంటే విద్యార్థులకు పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మణికొండ మున్సిపాలిటీ మాజీ ప్రజాప్రతినిధులు కె.నరేందర్‌రెడ్డి, కె.రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీఎం శ్రీ పథకంలో భాగంగా వచ్చిన క్రీడా పరికరాలను వారు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విద్యకు ఇచ్చిన విధ్యంగానే ఆటలకు ప్రాధాన్యం ఇచ్చి వాటిని విద్యార్థులకు నేర్పించాలన్నారు. ప్రభుత్వం ప్రతి పాఠశాలకు పీటీ టీచర్‌లను కేటాయించాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలలో ఈ నెల 21వ తేదీన నిర్వహించే యోగా ఏర్పాట్లను వారు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు నిరంజన్‌, నాయక్‌, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, నాయకులు సి.బీరప్ప, కుమార్‌, రాజేష్‌, శ్రవణ్‌కుమార్‌, గంగాధర్‌, యోగా మాస్టర్‌ ప్రదీప్‌ తదతరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్‌ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతపై అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం కార్పొరేషన్‌ పరిధిలోని 18వ డివిజన్‌లోని ధాత్రి కాలనీలో తడి, పొడి, హానికారక చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. 9వ డివిజన్‌లోని ప్రతాప్‌నగర్‌ కాలనీలో అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ క్లీనింగ్‌ ప్రక్రియను పరిశీలించారు. పీరంచెరువు మెయిన్‌ రోడ్డులోని పబ్లిక్‌ టాయిలెట్స్‌ శుభ్రం చేయించి అసరమైన సలహాలు, సూచనలిచ్చారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్‌, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్‌ ఎస్‌.వెంకటప్ప, వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు, బిల్‌ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణలో కార్మికుల కష్టాలను గుర్తించాలి



వట్టినాగులపల్లి డంపింగ్‌ యార్డును పరిశీలించిన విద్యార్థులు

మణికొండ: ప్రతి ఇంటి నుంచి బయటకు వస్తున్న చెత్త మున్సిపాలిటీ వ్యాప్తంగా టన్నులలో ఉండటంతో ఆయా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నార్సింగి మున్సిపాలిటీ శానిటేషన్‌ ఇంచార్జి లచ్చిరాం అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం నార్సింగి మున్సిపల్‌ కమిషనర్‌ టి.కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వర్మికంపోస్టు ఎరువుల తయారీ, వట్టినాగులపల్లిలోని చెత్త డంపింగ్‌ యార్డులో శ్రీ చైతన్య స్కూల్‌ విద్యార్థులకు రీసైక్లింగ్‌ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఇంటి నుంచి చెత్తను, తడి, పొడి రూపంలో సేకరించి తడి చెత్తతో వర్మికంపోస్టు ఎరువులను తయారు చేస్తున్నామన్నారు. పొడి చెత్తను రీసైక్లింగ్‌ చేసి అట్టలు, ఇతర ప్లాస్టిక్‌ వస్తువులను అమ్మటంతో పాటు వర్మికంపోస్టు ఎరువులుగా మారుస్తున్నామన్నారు. ప్రతి ఇంట్లో చెత్తను సాధ్యమైనంత తగ్గించుకోవటంతో పాటు సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ వస్తువులను నియంత్రించాలన్నారు. పర్యావణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

నియామకం

రాజేంద్రనగర్‌: మహిళా కాంగ్రెస్‌ రాజేంద్రనగర్‌ నియోజకవర్గం అధ్యక్షురాలిగా పుట్ట రమాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలు మొగిలి సునీతా రావు ఆమోదించారు. ఈ సందర్భంగా పుట్ట రమాదేవి మాట్లాడుతూ... మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

- మహిళా కాంగ్రెస్‌ రాజేంద్రనగర్‌ మండల అధ్యక్షురాలిగా పలుగుచెరువు మౌనిక నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని మహిళా కాంగ్రెస్‌ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి గురువారం జిల్లా కార్యాలయంలో ఆమెకు అందజేశారు. జిల్లా ఇన్‌చార్జి లక్ష్మి, రాజేంద్రనగర్‌ నియోజకవర్గ అధ్యక్షురాలు పుట్ట రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్‌: బీజేపీ రాజేంద్రనగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు సందీప్‌ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌ గవర్నమెంట్‌ స్కూల్‌ వద్ద గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రాజేంద్రనగర్‌ డివిజన్‌ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఈ నెల 20 యోగా డేను పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌ రెడ్డి పిలుపు మేరకు ఎల్బీ స్టేడియంలో యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. జూన్‌ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్‌ డివిజన్‌ తరఫున అగ్రికల్చర్‌ యూనివర్సిటీలో యోగా ఉంటుందన్నారు. జూన్‌ 23న డాక్టర్‌ శ్యామ్‌ ప్రసాద్‌ ముఖర్జీ బలిదాన్‌ దివస్‌ కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్‌ డివిజన్‌ 60 బూత్‌లో భాగంగా ప్రతి బూత్‌లో వంద మొక్కలు నాటామని తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్‌, నేతలు బొక్క బాల్‌రెడ్డి, సత్యనారాయణ ముదిరాజ్‌, హరికిషన్‌ జీ, సోల్కర్‌ రెడ్డి, బాబురావు, వాసు, రవీంద్ర, కోరని క్రాంతి, శ్రీకాంత్‌ రెడ్డి, వనత రెడ్డి, బండారి బాలకృష్ణ, మల్లేష్‌ చారి, వెంకటేష్‌, శ్రీనివాస్‌ రెడ్డి, టి.మల్లేష్‌, రమణ, తిరుమలేష్‌, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

రాజేంద్రనగర్‌: మున్సిపల్‌ శాఖలో స్పెషల్‌ గ్రేడ్‌ కమిషనర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన బాలయ్యను రాజేంద్రనగర్‌ సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంటమాలజీ విభాగం ఉద్యోగి గోపాల్‌ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని బాలయ్య నివాసానికి చేరుకొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

యువతి అదృశ్యం



జయశ్రీ

అత్తాపూర్‌: కుటుంబ సభ్యులు మందలించారనే మనోవేదనకు గురైన ఓ యువతి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యరెడ్డి సమాచారం మేరకు... తాండూరు పట్టణానికి చెందిన రామానాయక్‌ బతుకు దెరువు నిమిత్తం భార్య దేవిబాయితో కలిసి అత్తాపూర్‌ పాండురంగానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి జయశ్రీ(18) కూతురు ఉంది. కుటుంబ పోషణలో భాగంగా రోజు కూలీగా పని చేస్తూ తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది. ఆదివారం రాత్రి తల్లిదండ్రులు కూతురు జయశ్రీతో గొడవపడ్డారు. కలత చెందిన జయశ్రీ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా జయశ్రీ ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. జయశ్రీ ఇంటి నుంచి వెళ్లిపోయినప్పుడు బ్లాక్‌ అండ్‌ ఎల్లో కలర్‌తో కూడిన పంజాబీ డ్రెస్‌ ధరించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తెలుగు, హిందీ మాట్లాడుతుందని.. ఆచూకీ తెలిసిన వారు ఫోన్‌: 87125 74122లో సమాచారం ఇవ్వాలని కోరారు.

శంషాబాద్‌ పీఎస్‌ పరిధిలో వ్యక్తి...



శ్రీనివాస్‌

శంషాబాద్‌: డెయిరీ ఫాంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... కొందుర్గు మండలం చెక్కల గూడెం గ్రామానికి చెందిన చెక్కల శ్రీనివాస్‌(31) కొంత కాలంగా నర్కూడ వద్ద రామారావు అనే వ్యక్తికి చెందిన డెయిరీ ఫాంలో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 17 నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో యజమానితో పాటు వారి కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శంషాబాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు భరోసా ఇవ్వాలని మంత్రికి వినతి



మంత్రి తుమ్మలకు వినతి పత్రమిస్తున్న సబితారెడ్డి, కిషన్‌రెడ్డి తదితరులు

శంషాబాద్‌: జిల్లాలోని ప్రతి రైతుకూ రైతు భరోసా ఇవ్వాలని మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లాలోని అనేక మండలాల రైతులకు రైతు భరోసా రావడం లేదని తెలిపారు. ప్రతి రైతుకు రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శంషాబాద్‌ మండల మాజీ ఎంపీపీ మురళీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు, డీసీసీబీ డైరెక్టర్‌ సతీష్‌, పెద్దషాపూర్‌ మాజీ సర్పంచ్‌ సత్యనారాయణగౌడ్‌, పార్టీ ప్రధాన కార్యదర్శి గౌస్‌పాషా, మాజీ సర్పంచ్‌ బిక్క్యునాయక్‌, రాజునాయక్‌, రమేష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించం



శాంతినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం జరిగినా సహించేది లేదని... సకాలంలో నాణ్యతతో పనులు పూర్తిచేయాలని బీజేపీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శాంతినగర్‌ అయ్యప్ప స్వామి ఆలయం పరిసర ప్రాంతంలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు పనులపై జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న పలు పనులను, ఇతర ఉన్న రెండు మూడు చోట్ల సీసీ రోడ్డు పనులు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించి అనంతరం పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు కొరవడితే సహించేది లేదన్నారు. ఇంకా డివిజన్‌ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాహుల్‌, డివిజన్‌ అధ్యక్షుడు పాండు యాదవ్‌, నేతలు నర్సిరెడ్డి, రమేష్‌రెడ్డి, కొడల్‌, తలారి చిన్న, నాగేష్‌, నందు, శంకర్‌రెడ్డి, రాజు, అంజి, మహమ్మద్‌ షకీల్‌, శేఖర్‌, రాకేష్‌ తదితరులు పాల్గొన్నారు.